


# జీవిత రహస్యం

శ్రీవిరించి

నాలుగు నెలలు సెలవు తీసుకుని మనశ్శాంతి కోసం స్వగ్రామానికి వచ్చిన శేఖరానికి మొదటి రెండురోజులూ మామూలుగానే గడిచిపోయాయి. తల్లీ, తండ్రీ తమ మామూలు విచారాలు వెలిబుచ్చారు.

మూడో రోజున గాని శేఖరానికి తను ఊళ్ళో నాలుగు బజార్లూ తిరగడం ద్వారా కొంత, కాలహరణ చేయవచ్చునని తోచలేదు. తనకు పాత స్నేహితులంటూ యెవరూలేరు. అట్లా ఊళ్ళోకి వెడదామని లేచాడు శేఖరం.

ఊరు చిన్నదీ కాదు, పెద్దదీ కాదు. బయలుదేరబోతూ వుండగా తల్లి అడిగింది.

"ఎటన్నా వెడతావా? వెళ్ళు. చీకటి పడకుండా యింటికి రా. అన్నట్లు చెప్పడం మరచాను. రంగారావు నీ స్నేహితుడే గదూ! వాడు యిక్కడే వున్నాడు."

ఏ రంగారావు? తన స్నేహితుడు రంగారావు! ఇక్కడెందుకు వున్నాడు? ఏదో వుద్యోగంలో బొంబాయిలో వుండేవాడుగా!

'ఉద్యోగం మానేసి రెండునెలల నుంచి యింటిపట్టునే వుంటున్నాడు. వాళ్ళ అమ్మ ఒక్కటేగోల! నిక్షేపంలాంటి ఉద్యోగం చేజేతులా వొదులుకున్నాడని. పో నీ లే, కొండంత ఆస్తి, ఎలాతరగాలి? 'అంది తల్లి.

రంగారావును కలుసుకోవడం అంటే శేఖరానికి ఉత్సాహంగానే వుంది. చక చక నాలుగు అడుగులు వేశాడు. నడుస్తున్నంత సేపూ రంగారావును గురించిన సంగతులు నెమరుకు తెచ్చుకున్నాడు. అబ్బ ! రంగారావు! ఎంత సరదా అయినవాడు! ఎన్నాళ్ళయింది అతన్నిచూచి !

శేఖరం అక్కడకు వెళ్ళేసరికి రంగారావు తాపీగా కాఫీ తాగుతూ పడకకుర్చీలో జారగిల పడి వున్నాడు. గుమ్మంలో శేఖరాన్ని చూడడం తోటే ఎగిరిగంతు వేశాడు.

'ఏమోయ్ శేఖరం ! ఎక్కడనుండి ? ఎప్పుడువచ్చావ్—రా...రా...కూర్చో'అన్నాడు, దగ్గరకు తీసుకు కౌగలించుకుంటూ.

'మూడురోజులయింది వచ్చి. కానీ నీవు యిక్కడే వున్నట్లు రెండునిమిషాల కిందటే తెలిసింది. వెంటనే పరుగెత్తుకు వచ్చాను. ఏమిటి సంగతులు ? కులాసాగా వున్నావా ? ఉద్యోగం మానేశావా?'

'ఆ! చీకూ చింతా లేకుండా కాలం వెళ్ళ దీయడానికి లేకుండా ఆ పాడు ఉద్యోగం ఒకటి ఎందుకని రాజీనామా యిచ్చేశాను. ఇప్పుడు హాయిగా వున్నాననుకో. చూచేవాళ్ళు ఏమనుకున్నాగాని నామటుకు నాకు హాయిగా కులాసాగా విశేషంలా వున్నాను. నీసంగతేమిటి?... అన్నట్లు... అయాం సారీ శేఖరం, నీకు జరిగిన విపత్తు విని గుండె బాదుకున్నాను నాకు ఈ విచారాన్ని ఎలా తెలియపరచాలో అర్థం కావటం లేదు. తోచకుండా వుంది.' అంటూ మిన్నకుండిపోయాడు.

క్షణం సేపు నిశ్శబ్దత ఆవరించింది.

ఒక్క మారుగా వేయి దీపాలు ఆరిపోయి చీకటి వికటాట్టహాసం చేసు న్నట్లు అయింది,

ఈ వాతావరణాన్ని మళ్ళీ రంగారావే సరిచేశాడు.

'అనవసరంగ నీ మనస్థితి పాడుచేసి

నట్టున్నాను కాని యేమిచేయగలను? ఆ విపత్తు అలాంటిది. పోనీలే మనం గతాన్ని విస్మరించాలి' అని మళ్లీ ఒక్క నిమిషం ఆగి, 'ఏమన్నావు? వచ్చి మూడు రోజు లయిందా? నాకు కబురయినా తెలిసింది కాదే. మూడు రోజులూ యేం చేస్తున్నావు శేఖరం? నాకు కనబడకుండా! నన్నుమర్చిపోయావా?'

"నిన్ను మరచిపోవడమా? కాదు, మూడురోజులూ యింటిదగ్గరే ముడుచుకు పడుకున్నాను ఇవాళన్నా కాస్త వెలుగు చూద్దామని బయలుదేరబోతూ వుండగా మా అమ్మ నీ సంగతి చెప్పింది. నాకు చాల సంతోషం అనిపించింది. పరుగెత్తుకుంటూ వచ్చాను!"

'లలితా రెండు కాఫీ పట్రా. అన్నట్టు, శేఖరం వచ్చాడు, నీకు తెలుసుగదూ!' అంటూ రంగారావు లోపలకువెళ్లి మళ్లీ బయటకు వచ్చాడు. అతని వెంట — బహుశ లలితే కావును — ఒక యువతి వచ్చింది. శేఖరం ఆమెను చూచి గుర్తు తెచ్చుకున్నాడు అవును! లలిత. రంగారావు చెల్లెలు తను ఎరుగును. ఇక్కడే వుంది కావున్ను!

లలిత వచ్చి ఎదురుగా నిలుచుంటే శేఖరానికి ఎలా పలకరించాలో అర్థం కాలేదు. ఆ పని లలితే చేసింది.

'ఏం శేఖరం, మరచిపోయావా యేమిటి?'

'అబ్బే! లేదు. ఉక్కిరిబిక్కిరి అవుతున్నాను... బాగా వున్నావా లలితా?'

'అదే బాగు...' అంది లలిత పొడిపొడిగా.

'రెండు కాఫీ తయారుచేయి లలితా. నేనూ, శేఖరం షికారు వెళ్లి వస్తాం.'

లలిత లోపలకు వెళ్లింది.

రంగారావు చొక్కా వేసుకుంటూ 'సీతా— సీతా...' అని పిలిచాడు.

శేఖరం ఎన్నడూ ఎరగని ఒకామె వచ్చి గుమ్మంలో నిలబడింది.

'సీతా. ఇతను శేఖరం, నా ఫ్రెండ్.' అన్నాడు రంగారావు.

'నమస్కారం' అన్నదామె అక్కడే నిలబడి.

'నా శ్రీమతి అని వేరే చెప్పక్కర్లేదుగా' అన్నాడు రంగారావు, శేఖరాన్ని ఉద్దేశించి.

శేఖరం నవ్వాడు— ప్రతి నమస్కారం చేస్తూ.

షికారు వెడుతూ రంగారావు అన్నాడు—

'శేఖరం! జీవితం అంటే ఏమిటి? ఏది నిజమయిన జీవితం?'

శేఖరం ఏమీ బదులు చెప్పలేక పోయాడు.

'జీవితం అంటే కష్టాలపోగు. జరామరణ దుఃఖాలమధ్య మనం కొన్నాళ్ళు యీదులాడుతాం పంకిలమయంగా ప్రయాణం చేస్తాం. అదే జీవితం. ఇందులో సుఖాలన్నీ దుఃఖాలే. సుఖాలనీ, దుఃఖాలనీ రెండు కొండలు లేవు నిజానికి. ఒకటేకొండ ... జీవితంలో మన ప్రమేయం యేమీలేదు. జరుగనున్నది జరుగుతూ వుంటుంది. మన పనల్లా చూస్తూ వుండడం.'

శేఖరం గాఢంగా నిట్టూర్చి తల ఊపుతున్నాడు. 'అంతేనంటావా, రంగారావ్?'

'అంతకాక మరేమిటి? స్పష్టంగా కనిపిస్తూవుంటే!'

ఊరుదాటి పొలాలు చేరుకున్నారు.

పలచటి పిల్లగాలులు తగులుతున్నాయి. మనసులోని భావాల ఉద్వేగంవల్ల త్వరత్వరగా నడవలేకపోతున్నారు. అకస్మాత్తుగా రంగారావు ఆగిపోయాడు. 'ఎందుకు ఇంకా నడవడం? ఇక్కడే కాస్సేపు కూర్చుందాం. గాలి చల్లగా హాయిగావుంది!' ఇద్దరూ కూలబడ్డారు.

* * *

శేఖరం యింటికి చేరుకునే సరికి తండ్రి వచ్చి వున్నాడు. లోపలకు వచ్చి ఏమీ పలకకుండా కుర్చీలో జారగిలబడ్డ శేఖరాన్ని ఆయనే పలుకరించాడు—

'ఏంరా, రంగారావు కలిశాడా?'

'ఆ'

'ఏమంటాడు?'

'ఏమీ అనేదు, మామూలే.'

'అదే. ఉద్యోగం మానేసిన సంగతి అదీ చెప్పలా?'

'అమ్మే చెప్పింది.'

'వాడేం చెప్పలా?'

'చెప్పాడు'

'ఎందుకు మానేశానన్నాడు?'

## నూతన అణు చోదిత హిమ విచ్ఛేదక నౌక

'రోస్సియా' అనే నూతన అణు చోదిత హిమ విచ్ఛేదక నౌక లెనిన్‌గ్రాడ్‌లో నిర్మింపబడుతూ వుంది. అణు చోదిత హిమ విచ్ఛేదక నౌకల నిర్మాణంలో ఇంధనాన్ని తిరిగి నింపుకొనకుండానే దీర్ఘకాలం శక్తివంతంగా పని చేయగల నౌకలు ఆవిర్భవించాయి. ఇందువల్ల ఉత్తరాది సముద్ర మార్గాలలో గొప్ప మార్పులు ఆరంభమయ్యాయి. పూర్వం మూడు మాసాలపాటు గూడా లేని నౌకాయాన కాలం నాలుగైదు మాసాలకు పెరిగింది. కొన్ని విభాగాలలో అణు చోదిత హిమ విచ్ఛేదక నౌకలు సంవత్సరం పొడవునా నౌకాయానం సాగడానికి బాటలు వేశాయి.

'ఆర్కిటికా' అణు చోదిత హిమ విచ్ఛేదక నౌక 1977 ఆగస్టులో ఉత్తర ధ్రువాన్ని చేరడంతో ధ్రువ ప్రాంత నౌకాయానంలో నూతన శకం ఆవిర్భవించింది. సెంట్రల్ ఆర్కిటిక్ మంచును ఛేదించుకొని ఉత్తర ధ్రువాన్ని చేరడానికి యీ నౌకకు 72 గంటల సమయం మాత్రమే పట్టింది.

అణు చోదిత హిమ విచ్ఛేదక నౌకలు కలిగిన దేశం ప్రపంచంలో సోవియట్ యూనియన్ ఒక్కటే!

## గర్భనిరోధక మాత్రల వలన కేన్సర్?


గర్భనిరోధక మాత్రలను ఎక్కువ కాలం వుపయోగించడం వలన కేన్సర్ వచ్చే ప్రమాదమున్నదనీ, అందు వలన కేవలం డాక్టర్ల సలహాలపైనే వీటిని వుపయోగించాలనీ పశ్చిమ జర్మనీ డాక్టర్లు, తయారీ సంస్థలు పదే పదే హెచ్చరిస్తున్నారు. ఈ హెచ్చరికను పాకెట్ల పైన ముద్రించాలనే నియమాన్ని కూడా పశ్చిమజర్మనీ ఆరోగ్యశాఖ వారు ప్రవేశపెట్టారు. ఈ అలవాటుకు తోడుగా పొగ త్రాగే అలవాటు కూడా వున్నట్లయితే, ప్రమాదం రెట్టింపు అవుతుంది. ఈ మాత్రలలోని హార్మోనులు, సిగరెట్లలోని నికొటిన్ కలిస్తే, రక్తనాళాలు త్వరగా చెడిపోయే అవకాశం వుంది. అందువలన గర్భనిరోధక మాత్రలను వుపయోగించేవారిని పొగ అలవాటు మానవలసినదిగా ఆరోగ్య శాఖ వారు కోరుచున్నారు. అది సాధ్యం కాక పోతే, గర్భనిరోధానికి ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరించ వలసినదిగా వారు హెచ్చరించారు.

దీర్ఘవ్యాధులకు ఉత్తమవైద్యం
దురభ్యాసములకు లోనై. దాంపత్యసౌఖ్యంపొందలేనివారికి హెర్నియా, చర్మవ్యాధులకు పోష్టుద్వారా వరిబీజం(బుడ్డ) ఇస్నోఫిలియా ఉబ్బసం (దమ్ము) జీర్ణాశయ(గ్యాస్ట్రిక్)మూత్ర,స్త్రీల వ్యాధులకు ఆపరేషన్ లేకుండా చికిత్స చేయబడును. -రండి
డా॥ దేవర
5/1 బ్రాడీపేట, గుంటూరు. A.P.

సినిమాతారలు
శ్రీదేవి, సుజాత, జయసుధ, జయప్రద ల ఫోటోల సెట్టు 5 రూ. ఏయన్నార్, ఎన్టీఆర్, శోభన్‌బాబు, కృష్ణ, కృష్ణంరాజు ల ఫోటోల సెట్టు 6 రూ. నాటిగాయకుడు ఘంటసాల, నేటిగాయకుడు S.P బాల సుబ్రహ్మణ్యం ఫోటోల సెట్టు 4 రూ. సినీతారల అడ్రసుల పుస్తకం 2 రూ ఈ క్రింది అడ్రసుకు ఎం.ఓ. చేసిన వారికి పంపబడును.
వై.కె. మూర్తి
దాసరివారివీధి - విజయవాడ.2.



17 జూవెల్స్ రిస్ట్‌వాచ్
రు. 30/— లకు మాత్రమే.
ఆల్‌ప్రూఫ్. ఆటోమాటికల్‌గా పరీక్షించబడిన 17 జువెల్స్ విలువైన రిస్ట్‌వాచ్‌ను మీరు రు. 180 మాత్రమే. దీనిని మీరు మా సేల్సు ప్రమోషన్ స్కీము క్రింద రు. 30 లకే పొందగలరు. మీ ఆర్డరును పంపి నిజాన్ని పరీక్షించండి. అడ్వాన్సు అవసరంలేదు.
Eacho Radio&Transistor Co.,(13)
47, Old Anarkali, Krishan Nagar Delhi-51.




# జీవిత రహస్యం

'వాడి మనస్థితి బాగుండలేదట నాన్నా!'

'వాడి ముఖం. డబ్బున్నవాళ్ల వ్యవహారం అంతా అంతే. లలిత కనబడిందా. పాపం, పలకరించావా ?'

'ఆ'

ఇంతలో శేఖరం తల్లి అక్కడకు వచ్చింది. భోజనాలకు లేవమని పురమాయించింది.

భోజనానంతరం శేఖరం ఆరు బయట మంచంమీద వాలాడు. అతడిమనస్సు యింకా ఆలోచిస్తూనే వుంది. రంగారావు ఏంత వేదాంతం చెప్పాడు!

రంగారావు ఎలాగయినా తనకన్న చిన్న వాడికి మొదటి నుంచీ అన్ని విషయాలూ తెలుసు. ప్రతి దానిమీద నిశితమయిన అభిప్రాయాలు వున్నాయి. వాటికోసం పనిచేసే పట్టుదల వుంది. తనలాగ యధాలాపంగా యేదయితే అది అవుతుందిలే అని యేమరు పాటుగా వుండేవాడు కాదు ఇదివరకు.

లలిత అతనికి తగిన చెల్లెలే.

ఇద్దరికీ ప్రేమలో గొప్ప నమ్మకం, గౌరవం.

తనకు ఈ విషయాలతో యేమీ నికార్సయిన అభిప్రాయాలు లేనందుకు తనను ఆక్షేపించేవాళ్ళు, వేళాకోళం చేసేవాళ్ళు.

రంగారావు ప్రేమించి వివాహం చేసుకున్నాడు సీతను. వాడి దాంపత్య జీవితం సుఖంగా గడిచిపోతూ వుండాలి. అందుచేతనే ఆలోచించేందుకు యింత తీరుబడీ, ధైర్యం కుదిరాయి...

తెల్లవారి యేడున్నర అయినాక గాని శేఖరానికి మెలుకువ రాలేదు, అదీ రంగారావు తట్టి లేపిన మీదటనే.

శేఖరం కాలకృత్యాలు తీర్చుకుంటూ వుండగా రంగారావు చిన్నిగారితో బాతాకానీ కొడుతూకూర్చున్నాడు శేఖరం తయారయాక వాళ్ళిద్దరూ కాఫీ ఫలహారాలు ముగించి బయలుదేరారు. సహాసరి రంగారావు యింటికే వెళ్ళారు. అప్పుడే వచ్చిన దినపత్రిక చదువు కుంటూ వార్తలమీదవ్యాఖ్యానాలుచేసుకుంటూ కొంతకాలం గడిపారు. కులాసా కబుర్ల మధ్య రంగారావు విసుగ్గా యిలా అన్నాడు 'జీవితం చాల దారుణమయినది శేఖరం. ఉన్నవాళ్ళను ఉన్నట్టుగా వుండనీయదు. ఎన్నో వికల్పాలు సృష్టిస్తుంది· కాకపోతే నీబోటి

సత్పురుషుడికి భార్యా వియోగం యేమిటి? మా లలితకు మొగుడు పోవడం యేమిటి?'

శేఖరానికి కూర్చున్న కుర్చీ కదిలిపోతున్నట్లు అనిపించింది. నేల చీలి తను పాతాళంలోనికి దిగిపోతున్నట్టు అయింది.

ఇతని అయోమయ పరిస్థితి చూచి రంగారావు నిశ్చేష్టుడయ్యాడు 'ఏమిటట్లా కొయ్యబారిపోయినావు? ఆ సంగతులు తలుచుకుంటే నీకు అలా అయిపోతుందా? లే... లే.. అట్టే బెంగపడకు.'

'కాదు. అదికాదూ... లలితా...' అన్నాడు అస్పష్టంగా శేఖరం. ఆ పైన యింకేం మాట్లాడలేకపోయాడు.

'ఏమిటి శేఖరం? లలిత విషయమా? నీకు తెలియదా? దాని మొగుడు పోయాడు. ఇప్పుడేం. ఆరు నెల్లయింది. నీకు తెలీదన్న మాట అందుకే అలా అయిపోయినావు. అయాం సారీ నీకు తెలుసేమో అనుకున్నాను సరిసరి!' అన్నాడు.

'నాకు తెలియదు, తెలియదు. ఇప్పుడే వింటున్నాను. అయాం వెరీ సారీ... పాపం లలిత...' అనుకున్నాడు శేఖరం పైకి వినపడీ వినపడకుండా.

తల్లీ తండ్రీ అంత యిష్టపడకపోయినా లలితకు ఈ సంబంధం కావాలని చేశాడు రంగారావు, లలితకు యిష్టం అని. చెల్లెలుకు ఆమె కోరుకున్న మొగుడిని కూర్చానని ఆనందించాడు. కాని ఈ ఆనందం ఎక్కువ కాలం మిగలలేదు.

సంవత్సరం తిరగకుండానే లలిత బ్రతుకు బండలయింది...

రంగారావు తరువాత తను చేసిన ప్రయత్నం గురించి చెప్పాడు—

చెల్లెలుకు రకరకాలుగా నచ్చచెప్పాలని చూచాడు. కాని లలిత ఒకటే మాట— "మనసారా ప్రేమించాను. తొమ్మిది నెలలు యిద్దరం ఒకటిగా మెలిగాం. అనుకోకుండా ఆయన పోయారు. ఆ విచారంతో కుమిలిపోక నేను మళ్లీ పెళ్లి చేసుకుని కులుకుతూ కూర్చోనా? నీ చెల్లెల్ని అయినందుకు నీకు అలాగే అనిపిస్తుంది. కాని అన్నయ్యా! అది పొసిగే పని కాదు. నేను యే ముఖం పెట్టుకుని మళ్లీ సంసారం చేసేది? నా బతుకు యిలా తెల్లవారవలసిందే!...' అంటుంది.

చెవిలో గూడు కట్టుకు చెప్పాట్ట రంగారావు.

లలిత కాదంటుంది.

'ఇప్పటికీ ఆయన రూపు నాకు కనిపిస్తూనే వుంది. మేమిద్దరం అప్పుడప్పుడూ మాట్లాడుకుంటూ వుంటాం. నన్నుగురించి యిలాంటి మాటలు అనకు అన్నయ్యా. నాకు మళ్లీ యింకొకళ్లను ప్రేమించడం చేతకాదు. ప్రేమించడంలో నా వంతు అయిపోయింది. మళ్లీ ఆ పని నా వల్లకాదు. ఎన్నిట్లా ఒక మూల కాలక్షేపం చేసుకుంటూ తనువు తెల్లవార్చుకోనీ—' అంటుంది.


ఎన్ని రకాలుగానో బుజ్జగించి, లాలించి చెప్పడం అయ్యాక యింక మార్గం లేక రంగారావు చెల్లెల్ని భయపెట్టాడట కూడా. కానీ అదీ లాభంలేక పోయింది 'లలిత ఆత్మహత్య అయినా చేసుకుంటానందిగాని తిరిగి వివాహానికి వప్పుకోలేదు' అన్నాడు రంగారావు రుద్ధమయిన కంఠంతో.

*   *   *

నాలుగయిదురోజులు తనలో తాను కూడబలుకుకున్న తర్వాత ఒకనాడు సమయం కనిపెట్టి శేఖరంతో అన్నాడు రంగారావు— 'చూడు శేఖరం, నీవు అపార్థం చేసుకోనంటే చెబుతాను. బాగా ఆలోచించి చూడు. ఎందుకు చెబుతున్నానంటే జారిపోయిందానికి మనం ఎంత విచారించినా లాభంలేదుగదా! పోతే యిద్దరూ పడుచువాళ్లు, పట్టుమని పదేళ్ళయినా— మా లలిత విషయంలో మరీ అన్యాయం, పదినెలలయినా నిండలేదు— సంసారసుఖం అనుభవించినవాళ్లు కాదు. ముందురోజులన్నీ యిలాగే ఎండిపోయిన చెట్లలాగ ఎల్లాగడుపుతారు? జీవితానికి 'వికాసం' అంటూ ఒకటి కావాలిగదా! అదట్లావుంచి, మీరుయిద్దరూ ఒకళ్లకొకళ్ళు కొత్తవాళ్ళు కారు. చిన్నప్పటినుంచీ ఎరుగుదురు. అనుకోగూడదుగాని— అసలు మొదట్లోనే మీయిదరికీ పెళ్లి చేసినటయితే యీ చిక్కు వుండేది కాదు. మీ యిదరికీ జీవితంలో మంచి 'సామరస్యం' కుదురుతుందని నాకు అనిపిస్తోంది. లలితతో నేను యింకా మాట్లాడలేదు. దాని సంగతి నీకు మొదటే చెప్పానుగా. నీ ఉద్దేశ్యం కనుక్కున్న మీదట చెబుదామనుకుంటున్నాను...'

శేఖరం రంగారావుకు తనతల్లి ఆలోచనలు, తండ్రి ఉత్తరాలు, వాళ్ళు తన కోసం యిప్పటికో 'డజను' సంబంధాలు చూచి రావడం, తాను వాటిని త్రోసిరాజని తిరగడం, ప్రతిసారీ తల్లీ తండ్రీ మనసులో కష్టపెట్టుకుని పైకి ఏమీ మాట్లాడలేక పోవడం అంతా చెప్పాడు

రంగారావు 'ఊఁ' కొడుతూ విన్నాడు. అతనికి కూడా యేం జవాబు చెప్పాలో, సమాధాన పరచడం ఎల్లాగో తోచక యిలా అన్నాడు— 'శేఖరం, నువ్వు నీ మనస్సును కాస్త అర్థం చేసుకోకపోతే ప్రమాదం. నువ్వు ఎప్పుడూ యిలా ఒంటరిగా వుండవలసినవాడివి కాదు. నీకు సహధర్మచారిణి యివాళ కాకపోతే, మరో రెండు నెలలు... రెండు యేళ్లకయినా కావాలి. అప్పటికి నీవు ఆ అవసరాన్ని గుర్తిస్తావు. నాకు రూఢిగా తెలుసు. పోతే మా లలితనే చేసుకోమని నేనేం నిర్బంధం చేస్తున్నాననుకోకు. ఎవరినో ఒకరిని నీవు వివాహం చేసుకోవడమే నాకు



సంతోషం. అందునా మా లలితను చేసుకుంటే మరీ సంతోషం. అంతేగాని నా అభిప్రాయాలు నీమీద బలవంతంగా రుద్దుతున్నానని అనుకోకు.'

రంగారావు తన ముభావానికి బాధ పడుతున్నాడని శేఖరం అర్థం చేసుకున్నాడు. కాని అతని 'ఆఫర్'కు ఎగిరి గంతువేసి సరేననే స్తోమతు తనకు యెక్కడుంది? 'నా మాటలకు బాధపడకు రంగారావ్! ప్రస్తుతం నేను చాలా బలహీనుడిని. మళ్ళీ పెళ్ళి ప్రసక్తే నా మనసుకు సరిగా నాటటం లేదు. అటువంటప్పుడు లలితనా, యింకెవరినన్నానా అన్న ప్రసక్తే లేదు' అన్నాడు.

రంగారావు యింకేం మాట్లాడలేదు.

ఇంటికి వెళ్ళగానే రంగారావు చేసిన ప్రస్తావన తన తల్లితో తీసుకురావాలనుకున్నాడు శేఖరం. 'కాని ఎందుకు? తానే ఒక నిర్ణయానికి రాలేని విషయంలో ఆమెనుకూడా తీసుకువచ్చి మరింత గందరగోళం తీసుకురావడం ఎందుకు' అనిపించింది. కాని ఆమె ముందు యేదో రహస్యం దాస్తున్నవాడిలాగా దొంగతనం చేసి ఆ నేరం ఎవరిమీదనోవేస్తే తప్పు మతిస్థిరంలేనివాడిలాగ బాధపడసాగాడు.

## జీవిత రహస్యం

దీనికంటే— ఆమెతో చర్చించటమే మంచి దనిపించింది.

ఆమె చెప్పిన మాటలు మారు మాట్లాడకుండా తలవంచుకు మరీ విన్నాడు. ఆమె మాటల సారాంశం యిది- 'ఈ అయిదు నెలల్లో నీకు బంగారంలాంటి సంబంధాలు అనేకం తీసుకు వచ్చాం అవన్నీ కాదని యిప్పుడు యీ లలితనే చేసుకుంటానన్నా మాకేం అభ్యంతరం లేదు. రెండో పెళ్ళి పిల్ల. అయినా లలిత నాకు కోడలు అయితే నాకేం అయిష్టం లేదు. మీ నాన్నను కూడా ఒప్పించే బాధ్యత నాది. నువ్వు ఎవర్ని చేసుకున్నా, సుఖంగా వుండటమే మాకు కావలసింది. నీ సుఖమే మా పరమావధి.'

—శేఖరం ఈ ఆలోచనలతో సతమతం అవుతూ వుండగా, ఒకనాడు అతని ఆఫీసు నుంచి ఉత్తరం వచ్చింది. చదువుకుని అతను గట్టిగా నిట్టూర్పు విడిచాడు. అతన్ని సెలవు నుంచి 'రికాల్' చేస్తున్న ఆర్డరు అది.

'పుట్టెడు విచారంలో వున్నవాడిని నాలుగు నెలలపాటు విశ్రాంతిగా వుండనివ్వరేం? ఖర్మ!' అంది తల్లి.

రంగారావు మాత్రం 'విశేషంలా నా మాదిరే ఉద్యోగం మానేసి కూర్చో!' అన్నాడు.

కాని శేఖరం తల అడ్డంగా వూపాడు. 'లేదు, రంగారావ్. నేను నీలా విశ్రాంతిగా పేపరు చదువుకుంటూ, రేడియో వింటూ, క్రాస్‌వర్డ్ పజిల్స్ పూర్తి చేసుకుంటూ— బతకలేను. నాకు యెప్పుడూ ఏదో వ్యాపృతి కావాలి. లేకపోతే మనసుకి యేమీ తోచదు. రేపే బయలుదేరుతున్నాను. మళ్ళీ వీలుగా వుంటే వచ్చే నెలలో వస్తానే' అన్నాడు.

'నీ యిష్టం—'

—ఏమయినా శేఖరం ఊరికి వెళ్ళటానికి వీలులేదుగాక, వీలులేదని పట్టుబట్టింది తల్లి. కాని ఆమె మాట నెగ్గలేదు. శేఖరం గంటసేపు నచ్చజెప్పాడు. ఆమె కాదనలేక ఊరుకుండి పోయింది. ఆ రాత్రంతా మళ్ళీ పెళ్ళి చేసుకోమని, హితబోధ చేస్తూనే వుండిపోయింది. లలితను కూడా తీసుకు వెళమని చెప్పింది శేఖరం మామూలుపాట పాడాడు.

మరునాడు స్టేషనుకు సాగనంపటానికి రంగారావు కూడా వచ్చాడు. శేఖరానికి అప్పటి




పరిస్థితులలో అతనితో మాట్లాడటానికే భయం భయంగా వుండింది. చాల సిగ్గనిపించింది. స్నేహితుడిమాట వినలేక పోయినాను. పోనీ— కారణమయినా చెప్పలేకపోయాను— తనను గురించి రంగారావు ఏమనుకుంటాడు? ఏమయినా అనుకోవచ్చును అనిపించింది శేఖరానికి.

రైలు యింకా రెండు నిమిషాలకు కదులుతుందనగా రంగారావు అన్నాడు—'నీమనసులో ఆలోచనలన్నీ నాకు తెలుసు, శేఖర్. నీవేం బెంగపెట్టుకోకు నేనేమీ అనుకోను. కాని నీవు ఎంత తొందరగా యీ ఆలోచనలనుంచీ విడివడగలిగితే అంత మంచిది. నాకోసంకాదు. నీకోసమే చెబుతున్నాను. ఎప్పటికయినా నీవు స్థిమిత పడితేనే నాకు సంతోషం!'

ఇంజను కూత వేసింది. రైలు కదిలిపోయింది.

శేఖరం ముందుకు పోతున్నాడు.

చేయి ఊపుతూ రంగారావు తతిమ్మా వాళ్ళతోపాటు ప్లాట్‌ఫారం మీదనే వుండ పోయాడు.

* * *

వారం రోజుల్లో శేఖరం దగ్గర్నుంచీ వుత్తరం వచ్చింది రంగారావుకు అతను చిరునవ్వుతో కవరు చించి చదవడం మొదలు పెట్టాడు—

“నా ఆలోచనలన్నీ మూట గట్టుకొని మళీ వుద్యోగంలో చేరాను. మనం చిన్ననాటి స్నేహితులం. కాల ప్రవాహంలోపడి స్నేహాన్ని కొన్నాళ్ళు మరచిపోయాం. మళ్ళీ కొన్నాళ్ళకి గుర్తు తెచ్చుకున్నాం నీ ధోరణి నాకు ఎంతో ఉపకరించింది. నీ సలహాలు నేను జీవితంలో మరచిపోలేను. కాని యేం చేయను? ఎంత ఆలోచించినా నీ ఆఖరు సలహా నేను పాటించలేకపోతున్నాను. ఏం చేయను చెప్పు? కేవలం అసమర్థుడిని. కాని యిందుకు బలవత్తరమయిన కారణం వున్నదంటే నీవు నమ్మతావా?

నేను మూడు సంవత్సరాలు ఒక భార్యతో కాపురం చేశాను. విధివశాన ఆమె నన్ను భంగపుచ్చింది. లోకసహజమయిన విషయం అయితే నేను నిజంగా మళ్ళీ పెళ్ళి చేసుకుతీరాలి. పైగా చేసుకోకపోవడం తప్పిదం కూడాను.

నా భార్యను చాల గాఢంగా ప్రేమించాను. బహుశ నీకీ విషయం తెలియకపోవచ్చును. చాల మూర్ఖంగా మూఢంగా ప్రేమించాను. అలాంటి భార్య అకస్మాత్తుగా చనిపోయింది నిజానికి నేను కూడా అప్పుడే చనిపోయాను. నా ప్రాణం పోయినట్లే బాధపడుతున్నాను. నేను జీవచ్ఛవాన్ని. నామాటనమ్ము. చెప్పిన సంగతులే చెప్పి నీకు విసుగు పుట్టిస్తున్నానని తెలుసు. నాకు ప్రాణస్నేహితుడివి నువ్వు. నాకు నీకు మధ్య రహస్యాలు అక్కర్లేదు. కాని యీ రహస్యం నీ సమక్షంలో చెప్పలేకపోయాను. క్షమించు.

నా భార్య కాపురానికి వచ్చిన కొత్తలో యిద్దరం యేదోకులాసాకబుర్లు చెప్పుకుంటూ వుండగా ఆమె అంది— 'నేను చచ్చిపోతే మీరు మళ్ళీ పెళ్ళి చేసుకుంటారు కదూ?' అని.

### ముడతలు

నిన్న, మొన్నటి దాకా
పదిలంగా దాచుకున్న
యవ్వనపు సొగసుల్నీ,
వయసు పొంగుల్నీ,
ముఖ కవళికపు ముచ్చట్లనీ,
సడలించుకుంటూ దూసుకొస్తోందేం!
ఈ ముడతల ముసలి తనం!

— గుడిపాటి మురళీమోహన్

ఈ ప్రశ్న ఆమె ఎందుకు వేసిందో నాకయితే జ్ఞాపకంలేదు. కాని అప్పుడు మేం సవతి తల్లులు—పిల్లల అగచాట్ల గురించి తర్కించుకుంటున్నాం అనుకుంటాను.

నేను వెంటనే 'ఛ' అన్నాను.

'మీరు మళ్ళీ పెళ్ళి చేసుకుంటారు. నాకు తెలుసుగా' అంది.

'అవేం మాటలు, శకూ—' అని మందలించాను.

'ఎందుకండీ. అనగానే జరిగినట్లు అలా ఉలిక్కిపడతారు? మాట వరసకు చెప్పండి.'

అప్పటికీ నేనేం సమాధానం చెప్పలేదు. శకుంతలే మళ్ళీ అడిగింది; జవాబు చెబితేగాని వదలనని భీష్మించుకు కూర్చుంది. ఎంత బుజ్జగించినా వినలేదు.

'చేసుకోను శకూ. నామాట నమ్ము' అన్నాను— చివరకు.

'నిజంగా చేసుకోరా? నా ముఖంలోకి చూచి చెప్పండి. నా చేతిలో చేయి వేసి చెప్పండి.'

చేతిలో చేయివేసి ప్రమాణంచేసి చెప్పాను చేసుకోనని. శకుంతల అప్పుడు నన్ను తన హృదయానికి గాఢంగా హత్తుకోవడం నాకింకా జ్ఞాపకం వుంది. నా జవాబుకు ఆమె సంతోషించింది అనుకున్నాను... రంగారావ్ యిదీ జరిగిన సమాచారం.

తరువాత రెండేళ్ళలోనూ యీ ప్రస్తావవే రాలేదు.

శకుంతల చనిపోయింతర్వాత నేను ఆమెను గురించే ఆలోచించుకుంటూ వుండగా ... మూడుసంవత్సరాల కాపురంలోను ఒక్కొక్క రోజే మా చర్యలు నెమరుకు తెచ్చుకుంటూ వుండగా యీ సంఘటన నాకు గుర్తు వచ్చింది.

'ఆ మాటలు నిజమయినాయని బాధ కలిగింది. కేవలం శకుంతల అనాలోచితంగా అన్నమాటలు నిజం అయినాయి. నాకీసంగతి తల్చుకుంటే మరింత దుఃఖం వస్తూంది. కాని యేమంటూశకుంతలకు మాట యిచ్చానో అది దాటగూడదని తీర్మానం చేసుకున్నాను. నేనొకసంగతి ఆలోచించలేదనుకోకు. శకుంతల చివరి ఘడియలలో నేనామెదగ్గర వుండడం తటస్థించినట్లయితే ఆమె తప్పకుండా నాచేత 'మళ్ళీ పెళ్ళి చేసుకుతీరుతాను' అని ప్రమాణం చేయించుకు వుండేది. కాని అలా తటస్థపడలేదు. ఆమె చివరిఘడియలు ఆమెకుకూడా తెలియకుండా గడిచిపోయాయి. కాని యీ మాటలతో సరిపెట్టుకుని వెవకెప్పుడో యాదృచ్ఛికంగా ఆమెకు యిచ్చిన ప్రమాణం త్రోసిరాజని మళ్ళీ పెళ్ళి చేసుకోగల మనస్థైర్యం నాకు లేదు. ఏంచేయను?

ఇదంతా నీకు విడ్డూరం అనిపిస్తుంది. కాని యేం చేయను? మూడు సంవత్సరాలు నా సహధర్మచారిణిగా మెలిగిన శకుంతలకు యిచ్చిన ప్రమాణం లక్ష్యపెట్టకుండా వుండడం నా వల్లకాదు. అందుకే నేనిట్లా ఒంటరిగా జీవితం గడపదలుచుకున్నాను. నాకు యిందుకు కావలసిన సహనం, ధైర్యం కలగాలని నీవు కూడా కోరుకో.

ఇంతకంటే యింకేం చెప్పను? నా జీవిత రహస్యం నీకు చెప్పేశాను. దీనిని యింకెవరికీ చెప్పవద్దని ప్రత్యేకించి చెప్పనక్కర్లేదుగా! నాకోసం విచారపడకు. ఎప్పుడో వీలయినప్పుడు కలుసుకుందాం. మీ లలితను, సీతను అడిగానని చెప్పు.”